

'యాదవసంఘం బలోపేతానికి కృషి'

జగిత్యాలరూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): యాదవసంఘం బలోపేతానికి సభ్యులంతా కృషి చేయాలని జగిత్యాల జిల్లా యాదవసంఘం అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ అన్నారు. యాదవులకు సామాజిక న్యాయం దక్కేవరకు పోరాటం చేస్తామని మల్లేష్‌యాదవ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామంలో యాదవ సంఘ సభ్యుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల, గ్రామ యాదవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

సారంగాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి గౌడ సంఘం భవనం పెండింగ్ నిధులు రూ. లక్షలు మంజూరుకు కృషి చేసినందుకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను గౌడ సంఘం నాయకులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సొల్లు సురేందర్, గౌడ సంఘం అధ్యక్షుడు కొండ గంగయ్య, ఉపాధ్యక్షుడు కైలాసం, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, కోడిమ్యాల శ్రీనివాస్, కుమార్ శేఖర్, సుధాకర్, గంగయ్య, పురుషోత్తం, రాజయ్య, వినోద్, గంగారాం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

పెగడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బతికెపల్లికి చెందిన ఉరుమల్ల ఎల్లారెడ్డి అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందగా మంగళవారం ఉదయం ఎల్లారెడ్డి భౌతికకాయానికి మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎలగొండ కృష్ణహరి, మాదవరెడ్డి, మహిపాల్‌రెడ్డి, పెయ్యాల రాజు, గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నిబంధనలు కఠినతరం

- వ్యవసాయ శాఖ చేపట్టిన సర్వే ఆధారంగా ధాన్యం కొనుగోలు
- కొనుగోలు కేంద్రాల వద్ద అత్యాధునిక సాంకేతిక పరికరాలు
- గోనె సంచులపై ప్రత్యేక కోడ్
- జిల్లాలో 3.15 లక్షల ఎకరాల్లో వరి సాగు



జగిత్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేయడంతో పాటు రైతులకు నష్టం జరగకుండా కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. గతంలో తేమ శాతం నిర్ధారణ, సన్న, దొడ్డు రకం వడ్లను గుర్తించడం, ట్రక్ షీట్ల జారీ తదితర విషయాల్లో లోపాలు వెలుగు చూశాయి. కొందరు అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా కొనుగోలు కేంద్రాల్లో ఇటు రైతులను, అటు ప్రభుత్వాన్ని మోసం చేసి అందినంత దండుకున్నారన్న విమర్శలు చోటు చేసుకున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించింది. గతేడాది వానాకాలం సీజన్‌లోనే సాంకేతిక యంత్రాలు వినియోగించాలని సూచించినప్పటికీ సకాలంలో అన్ని కేంద్రాలకు యంత్రాలు అందలేదు. ఈ ఏడాది ఖచ్చితంగా యంత్రాలు వినియోగించి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రైతులకు మేలు జరిగేలా..

ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న నిబంధనలతో అక్రమాలకు చెక్ పెట్టడంతో పాటు నిజమైన రైతులకు మేలు జరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. రైతులందరూ బ్యాంకు ఖాతాలకు ఆధార్ ఫోన్ నంబర్ లింక్ చేసుకొని రైతుబంధు పథకం పొందుతుండడంతో ఎలాంటి సమస్య లేకుండా ధాన్యం కొనుగోలు డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తారు. కొత్త నిబంధనలతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు. రైతుల ఐరిస్ ఆధారంగా గన్నీ బ్యాగులు ఇచ్చి సాగు చేసే రైతుల నుంచే ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు.

వ్యవసాయ శాఖ సర్వేనే ప్రామాణికం..

వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేశారు. వ్యవసాయ శాఖ అందించిన సర్వేను ప్రామాణికంగా తీసుకొని పంటలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. వ్యవసాయ శాఖ చేపట్టిన సర్వేలో వానాకాలం సీజన్‌లో జిల్లాలో మొత్తం 3.15 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు నమోదు చేశారు. అధికారిక లెక్కల ప్రకారం 7.50 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అందుకు అనుగుణంగా 421 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సన్నాలను గుర్తించేందుకు ప్రత్యేక యంత్రాలు

సన్నధాన్యం గుర్తించడానికి ప్రతి కొనుగోలు కేంద్రానికి గ్రెయిన్ కాలిపర్ యంత్రాన్ని అందజేస్తున్నారు. సన్నరకం ధాన్యం వచ్చే కేంద్రాలకు రెండు పరికరాలను అందజేస్తారు. ఈ యంత్రం సహాయంతో బియ్యం పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6మిల్లీమీటర్ల తక్కువ, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సన్నాల కొనుగోళ్లలో ప్యాడి హల్లర్ యంత్రం సేవలు ఉపయోగించుకుంటారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి రెండు మిగతా 8లో..

వర్షాల నేపథ్యంలో వరి కోతలు నిలిపివేయాలి

-డీఏవో భాస్కర్



రైతులతో మాట్లాడుతున్న డీఏవో భాస్కర్

కొడిమ్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు వర్ష సూచన ఉన్నందున రైతులు వరి కోతలను నిలిపి వేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.భాస్కర్ అన్నారు. మంగళవారం కొడిమ్యాల మండలంలోని తిర్మాపూర్‌లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఏవో పరిశీలించారు. ఈసందర్భంగా డీఏవో మాట్లాడుతూ అడ్పదడపా ముసురు, తేలికపాటి వర్షాలు పడుతున్నందున రైతులు వరిని మూడు రోజుల పాటు కోయకుండా ఉంచుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన వరి ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. వరి కోసి ధాన్యం సిద్ధంగా ఉన్నట్లయితే కళ్ళాల వద్ద భద్రపర్చుకోవాలని ఆయన సూచించారు. రైస్ మిల్లులను త్వరలో అలాట్ చేస్తామన్నారు. డీఏవో వెంట మండల ఏవో పి. జ్యోతి. ఏఈవో గ్రీష్మ, పలువురు రైతులు ఉన్నారు.

కపాస్ కిసాన్‌పై అవగాహన

కొడిమ్యాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు కపాస్ కిసాన్‌పై అవగాహన కలిగి ఉండాలని రైతు నేస్తం కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోరారు. మంగళవారం కొడిమ్యాల మండలంలోని పూడూర్, తిర్మాలాపూర్ రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. తిర్మాలాపూర్ రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో డీఏవో వి.భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతు వేదికలలో నిర్వహించు రైతు నేస్తం కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కపాస్ కిసాన్ యాప్, పత్తి కొనుగోలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో పి. జ్యోతి, ఏఈవో గ్రీష్మ, తిర్మాలాపూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ సురేష్‌రావు, మాజీ సర్పంచు రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీలు గంగుల మల్లేశంయాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య శిబిరాలను పశు సంపద కలిగిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి మార్కెట్ చైర్మన్ బుర్ర రాములుగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నంచర్లలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ హేమలత, సిబ్బంది మతిన్, వినీత్, నర్సయ్య, జానీపాష, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

జగిత్యాల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఫైర్ అధికారి కృష్ణకాంత్ సూచించారు. బస్సుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ఫైర్ జాగ్రత్తలపై జగిత్యాల ఫైర్ స్టేషన్ అధికారులు ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. జగిత్యాల పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం ఫైర్ అధికారి కృష్ణకాంత్ ఆధ్వర్యంలో బస్సుల్లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, మంటలను ఎలా ఆర్పి వేయాలో ఫైర్ సిబ్బంది చూపించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, ఎంఎఫ్, కవిత, ఫైర్ ఎల్ఎఫ్ రవీందర్, ఫైర్ ఫైటర్స్ ఏ.మల్లేశం, ఏ శంకరయ్య, ఎం, కార్తిక్, జి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మున్నూరుకాపు నాయకులు

కథలాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డీసీసీ పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య, జగిత్యాల జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ తదితరులు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇటీవల బీసీలకు 42 శాతం రాజకీయ, ఆర్థిక, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంతో బీసీలకు న్యాయం జరగనుందని అన్నారు. అదేవిధంగా డీసీసీల్లోనూ రిజర్వేషన్లు అమలు పరచాలని కోరారు. విద్యార్థి దశ నుంచే పార్టీ బలోపేతం చేస్తున్న మున్నూరు కాపు నేత చెదలు సత్యనారాయణకు జగిత్యాల డీసీసీ కేటాయించాలని కోరారు.

జగిత్యాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- భవిష్యత్ తరాల కోసం ఆలోచించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అభివృద్ధికి త్వరలో మాస్టర్‌ప్లాన్ తీసుకు రానున్నా మని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగిత్యాల పట్టణానికి వివిధ అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రి 62 కోట్లు కేటాయించడంపై ముఖ్యమంత్రికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ వస్తే దానిని రాద్ధాంతం చేశారన్నారు. మాస్టర్ ప్లాన్ వచ్చిన తర్వాత దాని అమలు కోసం ప్రజాభిప్రాయం సేకరించి దానికి అనుగుణంగానే పనులు సాగుతాయని అన్నారు. ప్రజా జీవితానికి వచ్చిన తర్వాత భవిష్యత్ తరాల కోసం ఆలోచించాలని ఆయన అన్నారు. ఎప్పుడూ రాబోయే ఎన్నికల కోసం ఆలోచించడం తగదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో జగిత్యాల నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. కుచించు కుపోయి ఉన్న జిల్లా కేంద్రాన్ని విస్తరిం చామని అందుకు అనుగుణంగా టీఆర్‌నగర్‌తో పాటు తిప్పన్నపేట, లింగంపేట గ్రామాలను పట్టణంలో కలిపామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, నాయకులు అడువాల లక్ష్మణ్, గోలి శ్రీనివాస్, అనిల్, చెటిపెల్లి సుధాకర్, ఎంఏ ఆరిఫ్, బద్దం జగన్, బాలె శంకర్, జుంబర్తి రాజ్‌కుమార్, అర్మల్ల పవన్, పోతునుక మహేష్, అహ్మద్, పిట్ట ధర్మరాజు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

- చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి రాజేశం



విద్యార్థులను బహుమతులు ప్రదానం చేస్తున్న హెల్ప్‌లైన్ అధికారులు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మానవ జీవనానికి, సమాజానికి గొడ్డలి పెట్టుగా విస్తరిస్తున్న మాదక ద్రవ్యాలను నిర్మూలించడం మనందరి సామాజిక బాధ్యత అని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 అధికారి సామల రాజేశం అన్నారు. పట్టణంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం రాజేశం మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల ప్రస్తుతం యువత పక్కదారి పట్టే అవకాశాలు ఉన్నాయని, అందువల్ల యువత మత్తుపదార్థాల వైపు ఆకర్షితులు కావద్దనే ఉద్దేశ్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందన్నారు. డ్రగ్స్ అలవాటు పడినవారు ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవితారాణి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ గ్రామ సభలు

కొడిమ్యాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం హిమ్మతురావుపేట, చింతల్లపల్లి, గౌరాపూర్ గ్రామాలలో మంగళవారం ఈజీఎస్ అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో అభివృద్ధి పనులను ఎంపికపై గ్రామస్తులతో చర్చించారు. ఈ గ్రామ సభలలో ఏపీవో సతీష్, హిమ్మతురావుపేట గ్రామ మాజీ సర్పంచు కృష్ణారావు, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఈసీ రమాపతి, టీఏలు భువన్, గౌతమి పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం 7లో..

పశువులకు టీకాలు వేయించాలి
జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రకాశ్ 8లో..

సీఆర్పీల సేవలు వినియోగించుకోవాలి

- జిల్లా డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): వరంగల్ మహాసమాఖ్యకు చెందిన సీనియర్ సీఆర్పీల సేవలు వినియోగించుకోవాలని జిల్లా డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్ అన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ-సెర్ప్ సీఈవో ఆదేశాల మేరకు జిల్లాలో వరంగల్ మహాసమాఖ్యకు చెందిన 16మంది సీనియర్ సీఆర్పీలచే 16 మండలాల్లో 16 మండల, 12గ్రామ సమాఖ్యలకు ప్రత్యేక శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రఘువరణ్ తెలిపారు. జిల్లా ఏపీడీ సునీత మాట్లాడుతూ సెర్ప్ ఆదేశాల మేరకు మండల, గ్రామ సమాఖ్య లను బలోపేతం చేయడానికి సీనియర్ సీఆర్పీల ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా మండలాల్లో సంస్థాగత నిర్మాణం, సంస్థల బలోపేతం, ఆదర్శవంతమైన సంస్థలుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఆయా మండలాల్లోని సెర్ప్ సిబ్బంది పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో డీపీఎంలు రమేష్, నారాయణ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజ, కార్యదర్శి ఆమని, జిల్లా ఏపీయంలు గంగాధర్, హుస్సేన్, త్రివేణి, చక్రవర్తి, సత్యం, సీఆర్పీలు సలీమా, రేణుక, రజిత, స్రవంతి, కళావతి, సహనాసుల్తానా, వనిత, అనిత పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య


వీరలక్ష్మి (ఫైల్)

మంథని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో సిరిపురం వీరలక్ష్మి (70) అనే వృద్ధురాలు మంగళవారం ఇంట్లో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వీరలక్ష్మి పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడం, నడవలేని స్థితిలో ఉండటంతో జీవితంపై విరక్తి చెందింది. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఇంట్లో తలుపులు, దర్వాజాలకు ఉపయోగించే రంగులను కడగటానికి తెచ్చిన పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి కొడుకు వీరశంకర్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించినట్లు తెలిపారు.

రవాణాశాఖ అధికారుల తనిఖీలు

- 5 వాహనాలు సీజ్, రూ. 60వేల జరిమానా


రేణికుంట టోల్‌గేట్ వద్ద ఆర్టీఏ అధికారుల వాహన తనిఖీలు

తిమ్మాపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి 5 వాహనాలను సీజ్ చేసి 1 బస్సుకు జరిమానా విధించారు. ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్‌గేట్ వద్ద రాజీవ్ రహదారితో పాటు చొప్పదండి ప్రాంతాల్లో ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి ఆధ్వర్యంలో రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హైదారాబాద్ నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు వెళ్తున్న కాంట్రాక్ట్ క్యారేజ్ బస్‌లో నిబంధనలు పాటించకపోవడంతో జరిమానా విధించారు. అంతేకాకుండా టాక్సులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్‌తో పాటు ఇతర ధ్రువపత్రాలు లేని రెండు ట్రాక్టర్లు, రెండు లైట్ గూడ్స్ వాహనాలు, ఒక కారు మొత్తం ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంవిఐ రవికుమార్, ఏఎంవిఐ హరిత సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు ఆన్‌లైన్ సేవలు ఎలా ఉపయోగించుకోవాలి?


● ఐఎఫ్ఎమ్ఐఎస్ యాప్ వల్ల ఉపయోగాలు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఆన్‌లైన్ సేవలు ఉపయోగించుకోవాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సివి జీవన్‌రాజు తెలిపారు. అక్టోబర్ పెన్షన్లు యధావిధిగా జమ అవు తాయి. ఈ విషయంలో పెన్షనర్లు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఐఎఫ్ఎంఐఎస్ యాప్ గురించి ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) యాప్‌లో పెన్షనర్లు నమోదు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వంలో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల పేర్లు, హోదా, ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయని వారి జీతాలు అక్టోబరు నుంచి నిలిపి వేయాల్సిందిగా ఆర్థిక శాఖ నుంచి ట్రెజరీ డైరెక్టర్‌కు ఆదేశాలు అందాయి. ఇది కేవలం ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది.

● ఐఎఫ్ఎంఐఎస్ వల్ల ఉపయోగాలు

ఇది జీతాలు, పెన్షన్లు తదితర వాటి చెల్లింపులను వేగవంతం చేస్తుంది. చెల్లింపుల్లో పారదర్శకత ఉంటుంది. ఐఎఫ్ఎమ్ఐ యాప్ ద్వారా తమకు వచ్చే పెన్షన్ పే స్లిప్పులను, సవివరంగా, సులభంగా తెలుసుకోవచ్చు. అంతేకాక దీనిలోని ప్రొఫైల్ ద్వారా మన వ్యక్తిగత కుటుంబ వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నవి తెలుసుకోవచ్చు. ఈ యాప్ పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ వంటి సేవలను అందిస్తుంది. ప్రభుత్వం ఆర్థిక నిర్వహణ ప్రక్రియ ఆటోమేట్ చేయడానికి, ఆర్థిక సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగించే కంప్యూటర్ ఆధారిత వ్యవస్థ. రాష్ట్రంలో ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు తదితరాలు అన్ని దీని ద్వారానే నిర్వహిస్తున్నారు.



● ఆన్‌లైన్‌లో నమోదు ఇలా

స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఐఎఫ్ఎమ్ఐఎస్ పెన్షనర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎనిమిది అంకెల పీపీవో ఐడితో లాగిన్ అవ్వాలి. సెల్‌ఫోన్‌కు నాలుగు అంకెల ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేయగానే మన పేరు వస్తుంది. దాని కింద రెండు గదులు ఉంటాయి. దానిలో నాలుగు అంకెల పాస్‌వర్డ్ నింపి సబ్‌మిట్ చేయాలి. నెల వారీగా మనం తీసుకుంటున్న పదేళ్ల వివరాలు వస్తాయి. సెల్‌ఫోన్ పైభాగాన ఎడమవైపు ఆకుపచ్చ రంగుల వ్యూ ప్రొఫైల్ అని ఉంటుంది. దానిలో స్పౌజ్ పేరు, పుట్టిన తేది, బ్యాంక్ అకౌంట్ నెంబర్ వివరాలు వస్తాయి. సెల్‌ఫోన్ పైభాగాన కుడివైపు లోగో పక్కన మూడు అడ్డగీతలు ఉంటాయి. వాటిని తాకితే తొమ్మిది రకాల ఐఎఫ్ఎమ్ఐఎస్ సేవలు వస్తాయి. అందులో ముఖ్యమైనవి, పెన్షన్ పేస్లిప్, లైఫ్ సర్టిఫికేషన్ తాకితే వీడియో రికార్డింగ్ ద్వారా మనం ప్రతీ సంవత్సరం నవంబరు నుంచి మార్చి వరకు ఇచ్చే లైఫ్ సర్టిఫికెట్ నేరుగా మన ట్రెజరీ అధికారులకు ఇవ్వవచ్చు. ఈ లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ ద్వారా డిజిటల్‌లో ఇవ్వవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే మొబైల్ నంబర్ 9849204085కు సంప్రదించాలని తెలిపారు.

బాలికలు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

- పోక్సో కేసులో నిందితుడి అరెస్టు
- కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మైనర్లతో పాటు అమ్మాయిలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పాఠశాల, కళాశాలల్లో చదివే విద్యార్థినులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసే మహిళలు వేధింపులు, లైంగిక దాడులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్/అటెండర్‌గా పనిచేస్తున్న గీసుకొండ మండలం శాయంపేటకు చెందిన మహ్మద్ యాకూబ్ పాషా(30) మైనర్ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో పోక్సో కేసు నమోదు చేశామని, నిందితుడిని మంగళవారం రేకుర్తిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితుడు బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా చైల్డ్, మహిళా వెల్ఫేర్ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సదరు పాఠశాలలో విద్యార్థినుల నుంచి సమగ్ర వివరాలు సేకరించారని తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న అభియోగాలు నిజమేనని అధికారుల కమిటీ విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడి చేసినట్లు విచారణలో నిర్ధారణ అయినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై బీఎన్ఎస్ పోక్సో ఐటీ చట్టాల్లోని కఠినమైన సెక్షన్లలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భార్యను హింసిస్తున్న వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను హింసిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఆరెపల్లి గ్రామానికి చెందిన సత్తినేని కరుణాకర్ నిత్యం మద్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. రోజూ తాగి వచ్చి భార్యను కొడుతున్నాడు. గత నెల 15న కరుణాకర్ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యను విపరీతంగా కొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు నిందితుడిని అరెస్టు చేశారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ వరద గేట్లు

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం పెరగడంతో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సోమవారం గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 22,154 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,000 క్యూసె క్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 573 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. కాగా ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 886.509 టీఎంసీ నీరు రాగా, 818.796 టీఎంసీల నీరును వదిలారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చందుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 13 మందికి గాయాలయ్యాయి. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన భక్తుల టాటాఏస్ వాహనం, రుద్రంగి చెందిన కారు చందుర్తి మండలం లింగంపేట-మల్యాల గ్రామాల మధ్య వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. టాటా ఏస్ నడుపుతున్న కథలాపూర్ మండలం కలికోట గ్రామం చెందిన డ్రైవర్ రాజుకు కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయం కాగా, రుద్రంగి చెందిన లచ్చవ్వ, లక్ష్మి, దేవలక్ష్మి, రత్నమ్మలకు తలకు, కాళ్లకు గాయాలైనట్లు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పంగా గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం చందుర్తి రుద్రంగి చెందిన 108అంబులెన్స్‌లో పైలెట్లు నరేందర్, చాణక్య, ఈఎంటి గణేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని వేములవాడలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుపుకున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులు

బీఎస్సీ, హానర్స్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడదల

గణేశ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో 1,2,3వ సెమిస్టర్, బయో మెడికల్ సైన్స్ కోర్సులో 1,3వ సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్ శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. పరీక్షలు నవంబర్‌లో ఉంటాయని తెలిపారు. వచ్చే నెల 4వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని, 300 రూపాయల అపరాధ రుసుముతో 10వ తేదీలోగా అనుమతి ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

గుడిసె దగ్ధం


దగ్ధమైన వస్తువులు

గంభీరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలో గుగులోత్ రాజునాయక్‌కు చెందిన గుడిసె దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రమాదంలో ఇంట్లో సామగ్రితో పాటు సరుకులు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.90వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వపరంగా బాధితుడికి సహాయం అందించాలని గ్రామస్థులు కోరారు.

ఒకరిపై దాడి కేసు నమోదు

రామగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన గోగుల మహేందర్ అనే వ్యక్తిపై కేసు నమోదైంది. అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో గల రూ. 50వేల నగదుతో పాటు టీవీ ధ్వంసం చేసినట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అజ్ఞాతం వీడిన చంద్రన్న

- ఆయుధాలు లేకుండానే రాష్ట్ర డీజీపీ ఎదుటకు
- 45 ఏళ్ల అజ్ఞాతానికి స్వస్తి పలికి జనజీవన స్రవంతిలోకి
- దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు ప్రస్థానం
- అజ్ఞాతంలోకి వెళ్లిన నాటి నుంచి ఇంటి ముఖం చూడని చంద్రన్న

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి/జూలపల్లి)

ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఒక్కొక్కరుగా లొంగుబాట పడుతున్నారు. ఇటీవల జిల్లాకు చెందిన పార్టీ కీలక నేత పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ, అభయ్ 62 మంది మావోయిస్టులతో కలిసి ఆయుధాలతో లొంగిపోయారు. మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట జిల్లాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు (65) అలియాస్ చంద్రన్న అలియాస్ శంకరన్న 45 ఏళ్ల అజ్ఞాతం వీడి ఆయుధాలు పార్టీకి అప్పగించి లొంగిపోయారు. ఇది మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బేనని చెప్పవచ్చు. ప్రసాదరావుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 25 లక్షల రూపాయల రివార్డును అందజేశారు.


పుల్లూరి ప్రసాదరావు చదువుకున్న వడుకాపూర్ ప్రభుత్వ పాఠశాల


పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న(ఫైల్)

● ఆర్ఎస్‌యూ నుంచి అజ్ఞాతంలోకి..

జూలపల్లి మండలం వడుకాపూర్ చెందిన పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న 45 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నారు. 1961లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుల్లూరి శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా ప్రసాదరావు జన్మించారు. ఆయనకు ఇద్దరు సోదరులు అశోక్ రావు, తిరుపతి రావు, ఒక సోదరి ఉన్నారు. ఒకరు హైదరాబాద్‌లో, మరొకరు రామగుండంలో నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రులు మరణించగా గ్రామంలో సొంత ఇల్లు శిథిలావస్థకు చేరి నేలమట్టమైంది. ప్రసాదరావు వడుకాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1978లో పదో తరగతి చదివారు. 1979లో పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీ చదువుతుండగా రాడికల్ స్టూడెంట్ యూనియన్ ఆర్గనైజర్‌గా వ్యవహరించిన దగ్గు రాజలింగుతో చంద్రన్నకు పరిచయం ఏర్పడింది. రాజలింగు విప్లవ బోధనలతో ప్రభావితుడైన చంద్రన్న ఆర్ఎస్‌యూలో చేరి విప్లవ పంథా వైపు అడుగులు వేశారు.

● కిషన్‌జీకి కొరియర్‌గా పని చేస్తూ..

1980లో ఇంటర్ పూర్తి చేసిన చంద్రన్న మల్లోజుల కోటేశ్వర్ రావు అలియాస్ కిషన్‌జీకి కొరియర్‌గా పని చేస్తూ హైదరాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తున్న కేఎస్ గ్రూపు నాయకుల మధ్య సమాచారాన్ని చేరవేసే వారు. సీపీఐ పీపుల్స్ వార్ గ్రూప్ మరో నేత మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ మీసాల రాజిరెడ్డి దండకారణ్యంలో పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తుండగా, ఆయన నేతృత్వంలోని సాయుధ దళంలో చేరారు. చంద్రన్నతో పాటు మరో ఇద్దరిని 1980 జూలైలో ఛత్తీస్ గఢ్‌లోని బీజాపూర్ జిల్లా భూపాలపట్నం పోలీసులు అరెస్టు చేశారు. జగ్దల్‌పూర్ జైలులో ఉన్న చంద్రన్న అదే సంవత్సరం డిసెంబరులో బయటకు వచ్చి ఇంటికి చేరారు. తర్వాత కొద్ది రోజులకే అజ్ఞాతంలోకి వెళ్లి ఆసిఫాబాద్ దళంలో సభ్యుడిగా పనిచేశారు. 1981లో పీపుల్స్ వార్ ఆవిర్భావం తరువాత సిర్పూర్ దళ కమాండర్‌గా 1983లో బాధ్యత లు చేపట్టారు. 1987 వరకు దళ కమాండర్‌గా పనిచేసిన ఆయన డివిజనల్ కమిటీ సభ్యుడిగా బాధ్యతల్లో సిర్పూర్, చెన్నూరు ప్రాంత దళాల ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శిగా వ్యవహరించిన చంద్రన్న 1995లో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ కార్యదర్శిగా వ్యవహరించిన ఈ కమిటీలో చంద్రన్నతో పాటు జినుగు నర్సింహారెడ్డి అలియాస్ జంపన్న, సందె రాజమౌళి అలియాస్ ప్రసాద్‌లు సభ్యులుగా పనిచేశారు. 2006 వరకు కమిటీలో చంద్రన్నతోపాటు ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఇన్‌చార్జిగా వ్యవహరించిన చంద్రన్న 2007లో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

● 2008 నుంచి కేంద్ర కమిటీ సభ్యుడిగా..

కేంద్ర కమిటీ ప్రత్యామ్నాయ సభ్యుడిగా వ్యవహరించిన చంద్రన్న 2008లో పూర్తి స్థాయిలో సీసీ కమిటీ సభ్యుడిగా చేరారు. 2021 జూన్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేసిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ మరణించడ ంతో ఆ బాధ్యతలను చంద్రన్న చేపట్టారు. 2024 డిసెంబర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ బాధ్యతలు బడే దామోదర్ అలియాస్ చొక్కారావుకు అప్పగించిన తరువాత సీసీ మెంబర్‌గా చంద్రన్న తెలంగాణ కమిటీకి మార్గదర్శిగా వ్యవహరించారు. చంద్రన్న 1989లో సిర్పూర్, చెన్నూర్ డివిజనల్ కమిటీ సభ్యురాలు కుర్సంగి మోతిబాయి అలియాస్ రాధక్కను వివాహం చేసుకున్నారు. 2013 జూన్‌లో రాధక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరెస్టు కాగా 2015లో బెయిల్‌పై వచ్చిన తరువాత నిర్మల్ ప్రాంతంలోని వారి స్వగ్రామంలో నివాసం ఉంటున్నారు. అజ్ఞాతంలోకి వెళ్లిన నాటి నుంచి ప్రసాదరావు ఇంటి ముఖం చూడలేదు. 17 ఏళ్లకు పైగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేసిన చంద్రన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. అనారోగ్య సమస్యలు కూడా వెంటాడుతుండడంతో ఆయన జనజీవన స్రవంతిలో కలిశారు.

పార్టీలో కొనసాగుతున్నది వీరే...

మంథని మండలం శాస్త్రులపల్లికి చెందిన మరో కేంద్ర కమిటీ సభ్యుడు మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, రామగుండం ప్రాంతానికి చెందిన డీసీఎం అప్పాసి నారాయణ అలియాస్ రమేష్, కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన రాష్ట్ర కమిటీ మెంబర్ కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్, పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్ గంగిడి సత్యనారాయణరెడ్డి అలియాస్ విజయ్, పాలితం గ్రామానికి చెందిన డివిజన్ కమిటీ మెంబర్ ఆలేటి రామలచ్చులు అలియాస్ రాయలచ్చులు, ఏరియా కమిటీ మెంబర్లు దాతు ఐలయ్య, వడ్కాపూర్ చెందిన ఢీకొండ శంకరయ్య అలియాస్ శేషన్న, సుల్తానాబాద్ మండలం కొదురుపాకకు చెందిన జువ్వాడి వెంకటేశ్వర్ రావు అలియాస్ ధర్మన్నలు పార్టీలో కొనసాగుతున్నారు.

మాది లొంగుబాటు కాదు..

- పుల్లూరి ప్రసాద రావు అలియాస్ చంద్రన్న

'మాది లొంగుబాటు కాదు అభివృద్ధిలో కలిసి పనిచేయడానికి వచ్చాం. ఇప్పటి వరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పని చేశాను, భవిష్యత్తులో కూడా ప్రజల కోసమే పని చేస్తాను. మా సిద్ధాంతం ఓడిపోలేదు, ఓడించడం ఎవరి తరం కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. 'మా భావజాలంతో భవిష్యత్తులో మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉంది. ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనుకున్నాను. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీని ఎన్నుకున్నారు. దేవ్‌జీని సపోర్ట్ చేస్తున్నాను. ఆయుధాలను పార్టీకి ఇచ్చి వచ్చాను.' అని ఆయన వెల్లడించారు. మావోయిస్టులు మా అన్నదమ్ములని సీఎం రేవంత్ పిలుపునివ్వడంతో ముందుకు వచ్చామని, జనంలో ఉంటూ జనం కోసం పని చేస్తామన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య


వెంకటరాజం(ఫైల్)

ధర్మారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంజేరుపల్లి గ్రామానికి చెందిన సొన్నాయిల వెంకటరాజం (67) అనే వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నేళ్లుగా నాటుసారాకు అలవాటు పడడంతో ఆరోగ్యం క్షీణించింది. దీంతో వెంకటరాజం మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలిపి సోమ వారం తాగగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. వెంకటరాజం భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

సిమ్స్‌లో చోరీ

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) జనరల్ ఆసుపత్రిలో కొన్ని రోజులుగా చోరీలు జరుగుతున్నాయి. పేషెంట్లుగా ఆసుపత్రికి వచ్చి మొబైల్స్ ఎత్తుకెళుతున్న రామగుండం చెందిన వెంకటేష్‌ను మంగళవారం సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి కడుపునొప్పి అంటూ ఆసుపత్రిలో చేరిన వెంకటేష్ అతనికి ట్రీట్‌మెంట్‌లో కేర్ టేకర్‌గా ఉన్న రాజేష్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. అతని కదలికలు గమనించిన సెక్యూరిటీ సిబ్బంది రాజేష్ థియేటర్ కల్లు కాంపౌండ్ వద్ద మంగళవారం ఉదయం పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. జీఎం కాలనీకి చెందిన మదన్మోహన్ అనే వ్యక్తి రవీందర్ ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లడంతో అతడిని కూడా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కాగా అతని మతిస్థిమితం సరిగా లేదని, అతను తన బైక్ అని మరో బైక్ తీసుకెళ్లినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

రాచపల్లిలో దొంగల హల్‌చల్

ఇల్లందకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు పలు ఇళ్లలో హల్‌చల్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రికార్డు గది, ఆఫీస్ రూమ్‌లో చిందర వందర చేశారు. గ్రామంలోని సెలూన్ షాపులోని వస్తువులను కూడా పడేశారు. అదే విధంగా రెండు ఇళ్లలోని వస్తువులను కూడా చిందర వందర చేశారు. కాగా దొంగతనానికి వచ్చిన వ్యక్తి నల్ల సంచిలో డాక్యుమెంట్ పేపర్లు క్లాస్‌రూమ్‌లో మరిచి వెళ్లారు. ఎల్లమ్మ గుడిలో వస్తువులను చిందరగా పడేశారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ క్రాంతికుమార్ పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రాచపల్లిలో ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు కేశవపట్నం ఏఎస్ఐ సంపత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయగా వాటిని గుర్తించి పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్లను బాధితులైన చెంచాల శ్రీనివాస్, బుర్ర రవి, తోట అరవింద్‌లకు అందజేసినట్లు తెలిపారు. కాగా ఎవరైనా తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే వాటి వివరాలను వెంటనే మిస్సింగ్ మొబైల్ సీఈఐఆర్ పోర్టల్లో అప్లోడ్ చేయడం ద్వారా మొబైల్ గుర్తించవచ్చన్నారు. దీంతో తిరిగి స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేయడానికి అవకాశం ఉంటుందన్నారు.



సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఏఎస్ఐ సంపత్‌రెడ్డి

బద్ది పోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో సందడిగా మారిన బద్దిపోచమ్మ ఆలయం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అనుబంధ బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పట్నాలు వేసి ఒడిబియ్యం, నూతన వస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి ఇష్టమైన కళ్లసాక పెట్టి చల్లంగా చూడాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు చర్యలు తీసుకున్నారు.

భక్తులకు అందుబాటులో ప్రసాదాల కౌంటర్లు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల్లో భాగంగా ప్రసాదాల కేంద్రాలను భీమశ్వర ఆలయం వద్దకు తరలించారు. నెల రోజులుగా భీమన్న ఆలయం ముందు వేద పాఠశాలలో కౌంటర్ నిర్మాణాలను చేపట్టారు. రాజన్న ప్రసాద విక్రయాల కౌంటర్ పనులు పూర్తి కావడంతో రెండు కౌంటర్‌లను సోమవారం భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.


అంజన్న క్షేత్రంలో భక్తుల పూజలు



కొండగట్టులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మల్యాల, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం వేలాదిగా భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద కూడా పూజలు చేశారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, నిత్య పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

వేములవాడలో శరవేగంగా బ్రిడ్జి పనులు



వేములవాడ మూలవాగుపై వేగంగా జరుగుతున్న బ్రిడ్జి పనులు



14 మీటర్ల లోతుకు పిల్లర్లు వేసేందుకు యంత్రాలతో జరుగుతున్న పనులు

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణం
- భక్తులకు తప్పనున్న ట్రాఫిక్ ఇబ్బందులు

వేములవాడ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ తిప్పలు తప్పేలా నిర్మిస్తున్న వంతెన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వేములవాడ మూలవాగుపై అప్పటి ప్రభుత్వం 2015 సంవత్సరంలో రూ. 28 కోట్లతో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2018 సంవత్సరం వరకు రెండు వంతెనల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి వుంది. ఎడమ వైపు మొదటి బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయినప్పటికీ కుడివైపు బ్రిడ్జి నిర్మాణ దశలోనే కూలి పోయింది. బ్రిడ్జి నిర్మాణం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండటంతో పాటు రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు, పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించడంతో వేగంగా ముందుకు సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం 190 మీటర్ల పొడవుతో మూలవాగుపై నిర్మిస్తున్నారు. బ్రిడ్జిపైన ఐదు స్లాబ్‌లు ఏర్పాటు చేయాల్సి వుంది. అయితే ఇప్పటి వరకు రెండు స్లాబ్‌లు పూర్తి అయినప్పటికీ మూడు స్లాబ్‌ల నిర్మాణం జరగాల్సి ఉంది. తిప్పాపూర్ బస్టాండు సమీపంలో మొదటి స్లాబ్, అమరవీరుల స్థూపం వద్ద చివరి స్లాబ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. పిల్లర్ల కోసం యంత్రాలతో 14 మీటర్ల లోతుతో ఫైల్స్ చేయడంలో కాంట్రాక్టర్ నిమగ్నమై ఉన్నారు. వచ్చే వర్షాకాలం వరకు భక్తులకు, పట్టణవాసులకు బ్రిడ్జి అందుబాటులోకి తీసుకువస్తామని కాంట్రాక్టర్ చెబుతున్నాడు.

నిర్మాణ దశలోనే కూలిన బ్రిడ్జి

గతంలో మూలవాగుపై కుడివైపు నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ దశలోనే పలు మార్లు కూలిపోయింది. యేటా వర్షకాలం వస్తే చాలు బ్రిడ్జి కూలడం లేదా కుంగడం జరిగింది. రూ. 28 కోట్ల నిధులలో భూసేకరణ కోసం రూ. 7 కోట్లు సేకరించినట్లు అధికారులు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ కొరవడంతో భారీ వర్షాలు పడుతున్న సమయంలో పనులు చేసినట్లు కాంట్రాక్టర్‌లు ఆర్భాటం చేశారు. ఒక బ్రిడ్జి పనులు పూర్తి అయినా అప్పటి ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదని 2018లో కాంట్రాక్టర్ నిరసన తెలిపాడు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత శాఖ మంత్రి సహకారంతో పనులు జరిగేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. భూసేకరణ చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో కాంట్రాక్టర్‌లు పనుల్లో వేగం పెంచారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం

జమ్మికుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7 వేలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 115 మంది రైతులు 1,140 క్వింటాళ్ల విడిపత్తి, 22 మంది రైతులు 34క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7వేలు, కనిష్ఠ ధర రూ.5,400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఐదు మంది రైతుల నుంచి 51క్వింటాళ్ల పత్తి మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు చేపట్టింది. మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించారు.

ఐఐటీ మద్రాస్ నుంచి జంగపల్లి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

గన్నేరువరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐఐటి మద్రాస్ వారు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన డాటా సైన్స్ ఏఐ కోర్సు పూర్తి చేసి జంగపల్లి విద్యార్థులకు ఐఐటీ నుంచి ప్రశంసా పత్రాలు అందాయి. ఎనిమిది వారాల ఆన్‌లైన్ స్కూల్ కాన్సెప్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శివసాయి, హాసిని నవలిక, భవాని, వర్షిణిలకు ఐఐటీ నుంచి ప్రశంసా పత్రాలు అందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శారద ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా ఆన్‌లైన్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు ఐఐటి మద్రాస్ నుంచి సర్టిఫికెట్‌లను అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు గైడ్ చేసిన టీచర్ వసుంధర, విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కొలనూరులో కొండచిలువ



కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని కొలనూరు గ్రామంలో కొంతసేపు కొండ చిలువ హల్‌చల్ చేసింది. కొలనూరు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో మం గళవారం రాత్రి కొండ చిలువ రావడంతో గ్రామ స్థులు భయాందోళన గురయ్యారు. దీంతో గ్రామస్థులు కొండచిలువను హతమార్చారు.

రాజ్యాంగం, చట్టాలు దళితులకు వర్తించడం లేదు

- 1న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

సుభాష్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం, చట్టాలు దళితులకు వర్తించడం లేదని, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడిని నిరసిస్తూ నవంబరు 1న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 23 రోజుల క్రితం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేస్తే ఇంతవరకు అతడిపై చర్యలు తీసుకోలేదన్నారు. దేశంలో దళితులపై దాడులు జరిగితే వారికి రాజ్యాంగం, చట్టాలు సమానంగా పనిచేయడంలేదని ఆరోపించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కావడాన్ని అగ్రవర్ణాల వారు జీర్ణించుకోవడం లేదన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించినాటి నుంచి సుప్రీం కోర్టులో ఎస్సీ రిజర్వేషన్ అమలు కాలేదని, గవాయి బాధ్యతులు స్వీకరించిన తరువాత రిజర్వేషన్ అమలు చేశారని, దీనిని కూడా అగ్రవర్ణాలు జీర్ణించుకోవడం లేదని అన్నారు. బీఆర్ గవాయి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్న తరువాత మహారాష్ట్రలో అంబేద్కర్ గ్రామానికి వెళ్తే ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శితోపాటు డీజీపీ స్వాగతం పలకాలని, కానీ వారు రాలేదని, ఆనాడు వారిపై చర్యలు తీసుకుంటే ఈ దాడి జరిగేది కాదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చింది కూడా గవాయి అని, వర్గీకరణను వ్యతిరేకించేవారు కూడా ఈ ఘటనను ఖండించడం లేదని అన్నారు. దాడి జరిగిన తరువాత ఢిల్లీ పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. ఇటీవల నిజామాబాద్‌లో రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేస్తే 24 గంటల్లో స్పందించిన మానవహక్కుల కమిషన్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగితే ఇంతవరకు స్పందించలేదని, సుమోటోగా కేసు స్వీకరించలేదని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంద రాజు, జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, బోయిని కొమురయ్య, బక్కి మురళికృష్ణ, చెంచాల నవీన్, కొత్తూరి రాజన్న, తడగొండ శంకర్, చిలుముల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై పోక్సో కేసు నమోదు చేయాలి

- లైంగిక వేధింపుల్లో హెచ్‌ఎం, సిబ్బంది పాత్రపై విచారణ
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లైంగిక వేధింపులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి పోక్సో కేసు నమోదు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని ఓ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలో కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం ఐదు రోజులుగా విచారణ జరిపారుపుతున్నారన్నారు. లైంగిక వేధింపుల విషయంలో హెచ్‌ఎం, సిబ్బంది పాత్రపై విచారణ కొనసాగుతోందన్నారు.

వారి పాత్ర ఉన్నట్లు తేలితే పోక్సో కేసు నమోదు చేసేందుకు వెనుకాడవద్దని ఇప్పటికే అధికారులకు చెప్పామన్నారు. లైంగిక వేధింపుల బాధ్యుడితో పాటు, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేశారన్నారు. పిల్లలకు భరోసా ఇవ్వడంతో పాటు, తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా అధికారులు భరోసా కల్పిస్తున్నారన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని వంగర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం దారుణమన్నారు. నిర్బంధ విద్య కోసం ఇబ్బంది పెట్టకుండా విద్యార్థుల మానసిక పరిస్థితి తెలుసుకుని అందుకు అను గుణంగా బోధించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలోనూ గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆత్మహత్యలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా పరిస్థితి మారలేదన్నారు. ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాలను గాలికి వదిలి వేయడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో మొంథా తుఫాన్ ప్రభావం వల్ల తెలుగు రాష్ట్రాలకు భారీ, అతి భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తరుపున అన్ని రకాల సహాయక చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను అప్రమత్తం చేశామన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని19జిల్లాల్లో వర్షం ప్రభావం భారీగా ఉన్నందున ఇప్పటికే ఆ రాష్ట్రానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పంపించామన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామన్నారు. తెలంగాణలోనూ పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశ మున్నందున ఆయా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రం తరుపున అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కొనుగోలు కేంద్రానికి స్థలం ఏర్పాటు చేయాలి



బొమ్మనపల్లిలో రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా

చిగురుమామిడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రానికి గ్రామంలో స్థలం ఏర్పాటు చేయాలని బొమ్మనపల్లిలో గ్రామ రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో హుజూరాబాద్- హుస్నాబాద్‌కు వెళ్లే వాహనాలు నిలిచిపోయి రవాణాకు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వ భూమి కేటాయించాలని యేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో గత్యంతరం లేక నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ మద్దసాని రమేష్, ఎస్సై సాయికృష్ణ గ్రామానికి వచ్చి రైతులతో మాట్లాడారు. స్థలాన్ని పరిశీలించారు. దీనిపై జిల్లా అధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, గ్రామ రైతు ఐక్య వేదిక నాయకులు, అన్ని పార్టీల గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భూమి చదును చేస్తుండగా పురాతన నాణేలు లభ్యం

- పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ

పెద్దపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండలం చీమలపేటలో ఇంటి స్థలాన్ని చదును చేస్తుండగా లభించిన పురాతన కాలం నాటి 10 నాణేలను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాణేలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమలపేటకు చెందిన తొంటి రాజు అతని 7 గుంటల ఇంటి స్థలాన్ని ఈ నెల 25న ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా పురాతన కాలం నాటి 10 నాణాలు బయట పడ్డాయన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే జూలపల్లి ఎస్ఐ రెవెన్యూ అధికారులతో విచారణ జరిపారని, రాజు వద్ద ఉన్న 10 నాణేలు గుర్తించి నగల తయారీ వ్యక్తి వద్ద పరీక్షించారన్నారు. అవి వెండి, రాగి, ఇత్తడి లోహలతో తయారు చేసిన నాణాలుగా నిర్ధారించారని తెలిపారు. నిర్ధారించిన నాణాలు 111.50 గ్రాముల బరువు ఉన్నాయని, వాటిని పురావస్తు శాఖ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పురాతన వస్తువులు, నాణేలు లభిస్తే సంబంధిత అధికారులకు అప్పజెప్పాలని, వాటిని అక్రమంగా దాచుకోవడం నేరమన్నారు. సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, జూలపల్లి ఎస్ఐ సనత్ కుమార్ పాల్గొన్నారు.

మామిడిపల్లిలో పిచ్చికుక్క దాడి.. ముగ్గురికి గాయాలు

కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కొల్లేరు హనుమన్లు, మాసం నర్సయ్యపై కుక్క దాడి చేసింది. నిజామాబాద్ గ్రామానికి చెందిన ఓ మహిళ మామిడిపల్లికి బంధువుల ఇంటికి వస్తున్న సమయంలో ఆమెను కూడా గాయపరిచింది. మరిమడ్ల గ్రామానికి చెందిన నరసయ్య కూడా పిచ్చికుక్క దాడిలో గాయపడ్డాడు. వీరందరికీ కోనరావుపేటలో ప్రభుత్వ దవాఖానాలో మండల వైద్యాధికారి వేణుమాధవ్ చికిత్స అందించారు.

రొట్టమాకురేవు కవిత్వ అవార్డులకు కవుల ఎంపిక

త్వరలో అవార్డుల ప్రదాన సభ



రొట్టమాకురేవు కవిత్వ అవార్డుల బ్రోచర్

కారేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పన్నెండు సంవత్సరాలుగా తన తండ్రి షేక్ మహమ్మద్ మియా స్మృత్యర్థం కవులను కవిత్వ అవార్డులకు ఎంపిక చేస్తున్నామని, ఈ ఏడాది కూడా కవుల ఎంపిక జరిగిందని, త్వరలోనే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించ బోతున్నట్టు ప్రముఖ కవి షేక్ యాకుబ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 నుంచి 2024వరకు వెలువడిన కవితాసంపుటుల నుంచి నాలుగు కవితాసంపుటులను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిందన్నారు.

వాటిలో సిరిసిల్లకు చెందిన నాగిళ్ల రమేష్ రచించిన వల్లకొడిసె వన్నెకాడు, హైదరబాద్‌కు చెందిన జూపాక సుభద్ర రచించిన తెలంగాణి కైతల దొంతులు, మహబూబాబాద్‌కు చెందిన రహిమొద్దీన్ రచించిన కలలరంగు, ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన కంచరాన భుజంగరావు రచించిన నీటి గింజలు కవితా సంపుటిలను ఎంపికయ్యాయయన్నారు. వారికి తన తండ్రి షేక్ మహమ్మద్ మియా, తన గురుసమానులైన మాజీ ఎమ్మెల్యే కేఎల్ నరసింహారావు, తన మామ పురిటిపాటి రామిరెడ్డి పేరిట ఈ వార్డులను అందజేయనున్నామని, త్వరలోనే ఈ కార్యక్రమం వివరాలు వెల్లడిస్తామని యాకూబ్ తన ప్రకటనలో తెలిపారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు సహకరించండి

- ఎన్నికల అధికారి, డీసీవో మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో మనోజ్‌కుమార్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1న అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు సాఫీగా సాగేందుకు డైరెక్టర్లుగా పోటీచేస్తున్న అభ్యర్థులు, సభ్యులు, బ్యాంక్ సిబ్బంది సహకారం అందించాలని ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్.మనోజ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక అర్బన్ బ్యాంకు ప్రధానశాఖ కార్యాలయంలో పాలకవర్గ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పి.శివ నాగేందర్‌రెడ్డి, కె.వంశీకృష్ణ, ఎ.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు ఫిర్యాదు

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన నూనె పద్మ అనే మహిళ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి గ్రామ పంచాయతీ కార్యదర్శికి డబ్బులు ఇచ్చినట్లు ఆరోపిస్తూ ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా విచారణ జరిపి నిజనిర్ధారణ జరిగాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా తాను ఎవరి వద్ద నుంచి డబ్బులు తీసుకోలేదని తెలిపారు.

రికార్డులను తనిఖీ చేసిన ఏవో

కొడిమ్యాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి, తిర్మాలాపూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను మంగళవారం ఏవో పి.జ్యోతి తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఏవో స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. రిజిస్టర్‌లలో నిల్వలను, రికార్డులను సరైన విధంగా నిర్వహించాలన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో వ్యక్తి మృతిపై విచారణ

జగిత్యాల అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన బైరి లక్ష్మణ్ అనే వ్యక్తి ఆగష్టు 23వ తేదీన చికిత్స పొందుతూ జగిత్యాల లోని ఓ ప్రయివేటు ఆసుపత్రి మృతి చెందిన సంఘటనపై మంగళవారం జగిత్యాల ఉప వైద్యాధికారి ఎస్. శ్రీనివాస్ విచారణ జరిపారు. ఆసుపత్రిలో జరిగిన సంఘటనపై జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని మోతె వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విచారణ జరిపారు. హృదయ సంబదిత వ్యాదితో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అయితే ఈ విషయమై మృతుని కుటుంబ సభ్యులు చేసిన పిర్యాదు మేరకు మంగళవారం జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ ఆసుపత్రి కార్డియాలజీ వైద్యుడు డాక్టర్ లవకుమార్‌ను విచారించారు. విచారణ నివేదికను జిల్లా వైద్యాధికారికి సమర్పిస్తామని అన్నారు. ఈ విచారణలో ఆసుపత్రి యాజమాన్యం, మృతుని కటుంబ సభ్యులు ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారి స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం

కథలాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా మంగళవారం మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు అక్కడ ప్రచారం నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయనుందని చెప్పారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యదర్శి తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, బీసీ విభాగం అధ్యక్షుడు అల్లకొండ లింగంగౌడ్, బైర దేవ్, జక్కుల లక్ష్మీనారాయణ ఉన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావుకు పరామర్శ

కోరుట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీర్ హరీష్ రావును మంగళవారం హైదరాబాదులోని తన నివాసంలో కలిసి పరామర్శించారు. హరీష్‌రావు తండ్రి మృతి మృతి చెందగా నివాళ్లను అర్పించారు.

పెయింటర్స్ అసోసియేషన్

ధర్మపురి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ఉమ్మడి మండల పెయింటర్ల (శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి) అసోసియేషన్ అధ్యక్షులుగా బొల్లారపు రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ధర్మపురి మండల కేంద్రంలో ఉమ్మడి మండల పెయింటర్లు మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గజ్జెల రాజేష్, ప్రధాన కార్యదర్శిగా శ్యాం రావు ప్రభాకర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు రాయిల్ల రవికుమార్, ముస్కు తిరుపతి, కలమడుగు గణేష్, శేఖర్, లక్ష్మణ్, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో అరకొర వసతులు

●సరిపడా ఫర్నీచర్, ప్రహరీ లేక విద్యార్థుల ఇక్కట్లు ● ఉన్నతాధికారులు స్పందించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

కొడిమ్యాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ అసంపూర్తిగా ఉండటంతో కళాశాల మైదానం మందు బాబులకు అడ్డగా మారింది. కళాశాలలో 242 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మరుగుదొడ్లు బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి మాత్రమే ఉన్నది. అధ్యాపకులకు ప్రత్యేకంగా మరుగుదొడ్డి లేకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కళాశాలలో బోరు ఒకటి ఉండగా భారీ వర్షాలకు కూలిపోయింది. దీంతో కళాశాల వారు చేతి బోరుకు మోటారు బిగించి తాత్కాలికంగా నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన కళాశాలకు పూర్తి స్థాయిలో ప్రహరీ లేదు. ప్రధాన గేట్ ఏర్పాటు చేయకపోవడంతో తరగతులు జరుగుతున్నప్పుడు పశువులు లోపలికి వస్తున్నాయని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం ఫలితాల్లో జిల్లాలో మూడో స్థానం పొందినప్పటికీ కళాశాలలో అవసరమైన కనీస వసతులు లేకపోవటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కళాశాలలో నూతనంగా బోరు ఏర్పాటు చేయటంతో పాటుగా అదనంగా మరుగుదొడ్లను నిర్మించాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు. తరగతి గదుల్లో సరైన ఫర్నీచర్ లేక పోవటంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు విద్యార్థులు ఆవేదన చెందారు. కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ వసతులను కలిపించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరారు.



కొడిమ్యాల జూనియర్ కళాశాల భవనం



ప్రహరీ లేని కళాశాల గదులు

ఉన్నతాధికారులకు నివేదించాం

-వేణు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల



కళాశాలలో నెలకొన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించాం. సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించారు. త్వరలో కళాశాలలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

నిబంధనలు కఠినతరం

(ఐదో పేజీ తరువాయి)

యంత్రాలను అందజేయ నున్నారు. ఈ యంత్రం సహాయంతో సన్నరకం వడ్లను ఒలుస్తారు. గుప్పెడు వడ్లు తీసుకొని ఈ యంత్రంలో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం గింజలు బయటకు వస్తాయి. ఈ విధంగా బయటకు వచ్చిన బియ్యాన్ని కొలతల ఆధారంగా అవి సన్న రకమో కాదో నిర్ధారిస్తారు.

●ప్రతి గన్నీ బ్యాగ్‌పై..

కొనుగోలు చేసిన ధాన్యం సంచులపై కోడ్ వేస్తున్నారు. ప్రతి ధాన్యం సంచిపై కొనుగోలు కేంద్రం కోడ్ ధాన్యం రకం వివరాలు నమోదు చేస్తారు. సన్నరకం ధాన్యం అయితే ఎరుపు రంగుతో కొనుగోలు కేంద్రం నంబర్, ధాన్యం రకం వద్ద ఎస్ అని రాస్తారు. దొడ్డు రకం అయితే సంచులపై ఆకుపచ్చ రంగుతో డీ అని రాస్తారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని వేర్వేరు వాహనాల్లో రవాణా చేస్తారు. ఇక్కడ సన్నరకం ధాన్యాన్ని సంబంధిత ఏఈవోలు ధ్రువీకరిస్తారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే కొనుగోళ్లు

-జితేంద్రప్రసాద్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు జరపడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏఈవోలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల సాగు వివరాలను నమోదు చేశారు. సమగ్ర పంటల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించాం. వరి పంటకు సంబంధించిన రైతుల వివరాలను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఉంచింది. వరి పంట సాగు చేసిన రైతుల వివరాల ఆధారంగానే ధాన్యం కొనుగోలు చేస్తారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలను తీసుకుంటున్నాం. నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తరలించి మద్దతు ధరను పొందాలి.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్

పెగడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని పెగడపల్లి మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సుద్దపల్లి, బతికెపల్లి, మద్దులపల్లి గ్రామాలలో సింగిల్‌విండో, సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాములు గౌడ్ ప్రారంబించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల నిర్వాహకులు కనీస వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, సీఈవో గోపాల్ రెడ్డి, ఏపీఎం రవివర్మ, సీసీలు పాల్గొన్నారు.

●**రాయికల్:** మండలంలోని రామాజీపేట, మూటపెల్లి, కొత్తపేట గ్రామాల్లో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్ రెడ్డిలు ప్రారంభించారు. రైతులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు బేతి లక్ష్మి, మండల వసంత, బోడ భూమరాజం, గుండ నరేష్ పాల్గొన్నారు.

●**మల్యాల:** మండలంలోని నూకపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో మద్దుట్ల, గొర్రెగుండం, ఓబులాపూర్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెల్మ లక్ష్మారెడ్డి, మ్యాక లక్ష్మన్, మిల్రి శ్రీను, పోతాని రవి, అరున్‌రావు, వలీమహ్మద్, శేఖర్‌గౌడ్, నరసింహరెడ్డి, బండి రవిగౌడ్, తిరుపతి, మనోజ్‌క్రాంతి గౌడ్, ప్యాక్స్ సీఈవో అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

యంత్రాలను రాయితీపై అందించాలి

కొడిమ్యాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : రైతుల పంట ఉత్పత్తులను ఆరబెట్టె యంత్రాలను రాయితీపై ప్రభుత్వం అందించాలని వ్యవసాయ యూనివర్సిటీ సలహ మండలి మాజీ సభ్యుడు, పూడూర్ మాజీ సర్పంచు వెల్ముల రాంరెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం మాజీ సర్పంచు విలేకరులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో ఏడాది పొడవునా నవధాన్యాలను, ఇతరత్రా పంటలు తడిచి పోవటంతో రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారన్నారు. వర్షం కురిసిన ప్రతి సారి ధాన్యం తడిసి మొలకెత్తడం, నాణ్యత సరైన విదంగా ఉండక పోవటం, కనీస మద్దతు ధర రాక పోవటంతో రైతులు అన్ని విదాలుగా నష్టపోతున్నారన్నారు. పసుపు పంటకు మాత్రమె ఉడుకబెట్టి, ఆరబెట్టె యంత్రాలు రైతులకు అందుబాటులోకి ప్రభుత్వాలు తీసుకరావటం హర్షణీయమన్నారు. రాయితీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించి రైతులకు నష్టం కలుగకుండా ఆదుకోవాలని ఆయన కోరారు.

కొండగట్టులో హనుమాన్ చాలీసా పారాయణం

మల్యాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి వేద పాఠశాల విద్యార్థులు, భక్తులు భజన, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం దీపాలు వెలిగించారు. అలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, అలయ సిబ్బంది, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

'మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆరోపణలు అవాస్తవం'

జగిత్యాల, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని 138 సర్వే నంబర్‌లో గల 20 గుంటల భూమి విషయంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని జగిత్యాల పట్టణానికి చెందిన వ్యాపారవేత్త మంచాల కృష్ణ అన్నారు. జగిత్యాల కొత్త బస్టాండ్ చౌరస్తాలో గల పెట్రోల్ బంక్ స్థలంతో పాటు దానిని ఆనుకొని ఉన్న 20 గుంటల స్థలం కబ్జా చేశారని చేసిన ఆరోపణలపై మంచాల కృష్ణ మంగళవారం విలేఖరు సమావేశంలో మాట్లాడారు. మాతాత దారం వీరమల్లయ్య 1952 138 స. నంబర్‌లో 20 గుంటల స్థలాన్ని కిబాల ద్వారా మున్సిపల్ నుంచి కొనుగోలు చేశారని అన్నారు. తరువాత మున్సిపల్ అధికారులు ఈ స్థలంపై వస్తున్న ఆరోపణలతో మున్సిపల్ నిర్మాణం చేసినపుడు స్థలం యజమానులుగా హైకోర్టులో కేసు వేశామన్నారు. అపుడు కోర్టువారు స్థల యజమాన్య హక్కులను నిరూపించుకోవలసిందిగా మమ్మల్ని ఆదేశించిందన్నారు. అప్పుడు హైకోర్టులో డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేసుకోగా 1650/2008 మరియు 1664/2008 ద్వారా మున్సిపల్ తీర్మానాన్ని సెట్‌సైడ్ చేశారన్నారు. ఫలితంగా 2005లోని డబ్ల్యూపి నంబర్ 1623 మరియు 2604లలో సింగిల్‌జడ్జి ఇచ్చిన తీర్పు సెట్‌సైడ్ చేశారన్నారు. ఈ రెండు రిట్ పిటిషన్‌లకు సంబంధించినంత వరకు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును అమలు చేయకూడదని హైకోర్టు తీర్పు నిచ్చిందని తెలిపారు.

జగిత్యాల పట్టణంలో రూ.100 కోట్ల విలువైన భూమి కబ్జా

-ఆక్రమణలు తొలగిస్తేనే రోడ్డు వెడల్పు -మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఎలాంటి యాజమాన్య హక్కులు లేకుండా రూ.100 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో 1952లో దారం వీర మల్లయ్య అనే వ్యక్తికి పెట్రోల్, డీజిల్, కిరోసిన్ పంపు ఏర్పాటు కోసం ప్రభుత్వం రెండు వేల రూపాయల కిబాల కేటాయించిందన్నారు. అయితే ఆ తర్వాత మున్సిపల్ భూమికి సంబంధించిన పత్రాలు సమర్పించాలని కోరినప్పటికీ వీర మల్లయ్య జీవిత కాలంలో ఎలాంటి పత్రాలు సమర్పించలేదన్నారు. దారం వీరమల్లయ్య 1975లో మరణించగా ఆ తర్వాత వారి వారసులు కిబాలను తెరపైకి తీసుకువచ్చినట్లు సంబంధిత పత్రాలను జీవన్‌రెడ్డి చూపించారు. 2004లో మున్సిపల్ ఆస్తుల రక్షణ కోసం సబ్ కమిటీ వేయగా



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

వివిధ అంశాలను పరిశీలించి కిబాలా అనుమానాస్పదంగా ఉందని కమిటీ తేల్చినట్లు తెలిపారు.

ప్రభుత్వం పెట్రోల్ బంక్ కోసం 20 గుంటల భూమిని కేటాయిస్తే బంక్ కేవలం 4 గుంటలలోనే ఏర్పాటు చేశారని మిగిలిన 16 గుంటల భూమిని స్వాధీనం చేసుకోవాలని మున్సిపల్ కౌన్సిల్ నంబర్ 140 ద్వారా తీర్మానం చేసిందన్నారు. అలాగే రోడ్డు విస్తరణకు పెట్రోల్ బంక్ వద్ద జనరేటర్ గదిని తొలగించాలని నోటీస్ ఇస్తే మంచాల కృష్ణ అనే వ్యక్తి రిట్ వేశారని వివరించారు. ఎలాంటి యాజమాన్య హక్కులు లేకుండానే క్రమ విక్రయాలు జరిపారని ఆరోపించారు. వీర మల్లయ్య తమ్ముడు పురుషోత్తం వారసత్వ ఆస్తిగా భాగాలు చేసుకున్నారని అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని మరో రిట్ వేశారన్నారు. కాగా ఆ రిట్ చెల్లదని యాజమాన్య హక్కుల కోసం సివిల్ కోర్టుకు వెళ్లాలని కోర్టు ఆదేశించినట్లు పేర్కొన్నారు. దారం వీర మల్లయ్య కబ్జాలోనే ఉన్నారని, యాజమాని అయితే 8వ కాలంలో పట్టాదారుగా పేరు లేదని కోర్టు పేర్కొనట్లు వివరించారు. మున్సిపల్ తీర్మానం ఇప్పటికి అమలు ఉన్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవడానికి ముఖ్య మంత్రితో పాటు మున్సిపల్ శాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు జీవన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు శీలం సురెందర్, రమేష్, మాజీ కౌన్సిలర్లు కొంగ్ర జగన్ పాల్గొన్నారు.

మత్స్య శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న గ్రామస్థులు

రాయికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో మంగళవారం జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో అధికారులు గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో చేపల మత్స్య సంఘం ఏర్పాటు కోసం ముదిరాజ్ సంఘం సభ్యులు మత్స్యశాఖను కోరగా ప్రజాభిప్రాయం కోసం గ్రామస్థులతో సభను ఏర్పాటు చేశారు. దీనికి గ్రామంలోని కొత్త చెరువు అందరిదని గ్రామస్థులు నిరాకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి, తహసీల్దార్ నాగార్జున, ఎంపీవో సుష్మా పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

-మున్సిపల్ కమిషనర్ రవీందర్

కోరుట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కోరుట్ల మున్సిపల్ కమీషనర్ రవీందర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని వివిధ ప్లాస్టిక్, కిరాణం దుకాణాలలో మున్సిపల్ అధికారులు దాడులు చేసి నిలువ ఉన్న ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలకు నిలువ ఉంచిన దుకాణ యజమానులు జరిమానాలను విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమీషనర్ రవీందర్ మాట్లాడారు.

ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్‌ను విక్రయిస్తే జరిమానాలను విధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కోరుట్ల మున్సిపల్ కమీషనర్ రవీందర్ అన్నారు. ప్రతి దుకాణ దారులు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. తడి, పోడి, హానీకరమైన చెత్తను వేరువేరు చేసి మున్సిపల్ వాహనంకు దుకాణ యజమానులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, రాజేంద్రప్రసాద్, రికార్డు అసిస్టెంట్ జగదీష్, వార్డ్ ఆఫీసర్లు, ఎన్విరాన్మెంట్ ఇంజీనీర్ మహేష్, హేమంత్, రాజ్‌లతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో వసతులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ సంజీవ్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మండలంలోని గోధూర్, తిమ్మాపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు కళాశాలలో అందిస్తున్న విద్యా, మౌలిక వసతుల గురించి మంగళవారం అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్‌వాలా ద్వారా ఉచిత ఆన్లైన్ కోచింగ్, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ లో ఉచితంగా సీటు లభిస్తుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీడీపీవో మమత

కొడిమ్యాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ కె.వేణు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థులు ముందు ఉండి కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాలను నిర్మూలించినట్లయితె దేశం అభివృద్ది చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ పి. తిరుపతి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ బి. భాస్కర్, 1098 సూపర్ వైజర్ ఎన్. అశోక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

●**రాయికల్:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో మమత అన్నారు. మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో మంగళవారం "మిషన్ పరివర్తన నషా ముక్తి భారత్ అభియాన్ "లో భాగంగా సే నో టు డ్రగ్స్-ఎస్ టు డ్రీమ్స్, గోల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, వినియోగాన్ని నిషేధించడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భాగ్య, సువర్ణ, నరేష్, డీహెచ్‌ఆడబ్ల్యూ అకౌంటెంట్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయకుడికి మాజీ మంత్రి సత్కారం

జగిత్యాల అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పెల్లి గ్రామానికి చెందిన గల్ఫ్ కళాకారుడు ప్రస్తుత ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షులు రాజాగౌడ్‌ను మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల హక్కుల కోసం తన వంతు బాధ్యతగా కృషి చేస్తున్న రాజాగౌడ్ ఇటీవల దుబాయి వేదికగా మా గల్ఫ్ సంస్థ నిర్వహించిన కార్మిక గీతాలాపన కార్యక్రమంలో కార్మికుల కష్టాలపై గీతాన్ని ఆలపించారు.

దీంతో రాజాగౌడ్‌కు థర్డ్ సింగర్ అవార్డు దక్కింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కలిసిన రాజాగౌడ్‌ను అభినందించి సత్కరించారు.

పశువులకు టీకాలు వేయించాలి



రికార్డు తనిఖీ చేస్తున్న జిల్లా వెటర్నరీ అధికారి ప్రకాశ్

జగిత్యాలరూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ప్రకాశ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ సర్జన్ డాక్టర్ వాసుపావని, పొలాస వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి పూర్ణచందర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు విశాల్, నరేష్, జ్యోతి, సిబ్బంది రాజు, అనిత, గంగయ్య, రాములు, వెంటకమ్మ, గ్రామరైతులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: వ్యాది నివారణ టీకాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రకాష్ అన్నారు. పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పశువైద్యాధికారి మనీషాపటేల్ శుక్రవారం మండలంలోని సత్తక్కపల్లి గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ మనీషాపటేల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

-పెగడపల్లి ఎంపీడీవో ప్రేమ్‌సాగర్



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రేమ్‌సాగర్

పెగడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని పెగడపల్లి ఎంపీడీవో ఇనుగంటి ప్రేమ్‌సాగర్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని పలు ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసుకుని బిల్లులు పొందాలని సూచించారు. నిర్మాణ పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదని త్వరితగతిన పూర్తి చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, పిటిసి స్వామి తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వరప్రసాద్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వరికోత సమయంలో హార్వెస్టర్ యాజమానులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ వరప్రసాద్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల హార్వెస్టర్ యజమానులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాత మాత్రమే కోతలు చేపట్టాలన్నారు. కోతల సమయంలో బ్లోవర్ తప్పని సరిగా ఆన్‌లో ఉంచాలన్నారు. నేల నుంచి 3, 4 సెంటీమీటర్ల ఎత్తులో వరి కోతలు చేపట్టినట్లయితే చెత్తాచెదారం రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి రాజకుమార్, ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.